సాక్షి మంచిర్యాల

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



దివ్యాంగుల 'వికాసం'

8లో▸

ఉట్నూర్‌లో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వికాసం పాఠశాలలో నాలుగు రకాల వైకల్యం కలిగిన 142 మందికి విద్యాబోధన చేస్తున్నారు. అంధ విద్యార్థులకు వసతులు కల్పించారు.

అటవీశాఖలో విచారణ

మంచిర్యాలక్రైం: అటవీశాఖ బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నంపై శనివారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో విచారణ నిర్వహించారు. ఎఫ్ఆర్‌వో రవి, సెక్షన్ ఆఫీసర్ రాందాస్, క్లర్క్ ఖరీమ్ వేధింపులు భరించలేక లత ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు అటవీశాఖ ఉద్యోగుల మహిళా ఫిర్యాదుల పరిష్కార జిల్లా కమిటీ ఆధర్వంలో వివరాలు సేకరించారు. ఒక్కొక్కరి నుంచి రహస్యంగా విచారించినట్లు తెలిసింది. విచారణ కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి వివరణ కోసం ప్రయత్నించగా స్పందించలేదు.

గరిష్టం/కనిష్టం
29.0 /15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్ సకాలంలో పూర్తి చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పాల్గొన్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: వరిధాన్యం సీఎంఆర్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మర పట్టించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అందించాలని తెలిపారు. మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా తప్పనిసరిగా మిల్లింగ్ చేసి పంపించాలని, సీఎంఆర్ ప్రక్రియలో రీసైక్లింగ్ బియ్యం రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తంగా వానాకాలం, యాసంగి సీజన్ కలుపుకొని 29,749 మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్, 50,890 మెట్రిక్ టన్నుల రా రైస్ సీఎంఆర్ చేయాల్సి ఉందని తెలిపారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు మిల్లర్ల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు రేషన్‌కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆధార్‌కార్డు జిరాక్స్ తప్పనిసరిగా జత చేయాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందేలా చర్యలు తీసుకుంటామని, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జనవరి 6 వరకు(ప్రభుత్వ సెలవు మినహాయించి) ప్రతీ రోజు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వేడుకలపై నిఘా

మంచిర్యాలక్రైం: ఈ ఏడాది చివరి రోజు డిసెంబర్ 31న వేడుకలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రజలు శాంతియుతంగా వేడుకలు జరుపుకొనే విధంగా రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి నిఘాను పటిష్టం చేశారు. రాత్రి 10గంటల నుంచే పోలీసులు ప్రత్యేక బలగాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. అక్రమ సిట్టింగ్‌లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, డీజేల సంబరాలు, గుంపులుగా తిరుగుతూ మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వేడుకలను రాత్రి 12.30గంటలలోపే ముగించుకోవాలని సూచించారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు.

మూడో రోజు 41,341 దరఖాస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శిబిరాలకు జనాలు పోటెత్తుతున్నారు. శనివారం మూడో రోజు 41,341 దరఖాస్తులు వచ్చాయి. 16 మండలాల్లోని గ్రామాల్లో 50 కేంద్రాలు, 7 మున్సిపాలిటీలలో 174 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 32,581 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా 41,341 దరఖాస్తులు అందాయి. వలస వెళ్లిన కుటుంబాలు దరఖాస్తులు అందజేసేందుకు స్వగ్రామాల బాట పడుతున్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల కోసం దరకాస్తులు అందజేస్తున్నారు. మూడు రోజుల వ్యవధిలో 1,65,486 కుటుంబాలకు సంబంధించి 1,07,120 దరఖాస్తులు స్వీకరించారు. ఐదు గ్యారంటీలకు సంబంధించినవి కాకుండా ఇతర దరఖాస్తులు 6,031 అందజేశారు.

కాస్మొటిక్ చార్జీలు వచ్చేశాయోచ్

బెల్లంపల్లి: జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, బీసీ, ఎస్టీ, జనరల్ గురుకులాలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు విడుదలయ్యాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జూన్ నుంచి ఆగస్టు వరకు నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. కాస్మొటిక్స్, వాషింగ్(దోబీ) చార్జీల బిల్లులను మూడు రోజులుగా విద్యార్థులకు చెల్లిస్తున్నారు. ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు నెలకు ఒక్కో విద్యార్థికి కాస్మొటిక్స్ చార్జీ రూ.113, వాషింగ్ చార్జీ రూ.25 చొప్పున అందజేస్తున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 5నుంచి 7వతరగతి 19,500, 8నుంచి 10వ తరగతి 5,460, ఇంటర్ నుంచి డిగ్రీ విద్యార్థులు 8,200మంది ఉన్నట్లు సమాచారం.

వీడ్కోలు..2023

- చేదు, తీపి జ్ఞాపకాల గుర్తు కాలం
- ఈ ఏడాదిలో జిల్లాలో పలు మార్పులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాల గమనంలో మరో ఏడాది గడిచిపోయింది. ఈ ఏడాది జిల్లా ప్రజలకు ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చింది. అనేక ఘటనలు.. మరెన్నో మార్పులకు గత 12నెలల కాలం సాక్షిభూతంగా నిలిచింది. ఈ క్రమంలో జిల్లాలో రాజకీయ, అధికార యంత్రాంగంలో పెను మార్పులు సంభవించాయి. ముఖ్య అధికారులు బదిలీపై వెళ్లగా.. అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగానూ మార్పులు చోటు చేసుకున్నాయి. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ ఆ ఘటనలు.. మార్పులను సింహావలోకనం చేసుకుందాం.



కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సత్యాగ్రహ సభలో కళాకారులతో గద్దర్ (ఫైల్)

రెండు వేల నోట్ల రద్దు



ఆర్‌బీఐ రెండు వేల కరెన్సీ నోట్లు రద్దు చేసినా జిల్లాలో పెద్దగా ప్రభావం చూపలేదు. రెండు వేల నోట్లు ఉన్న వారు మాత్రం వివిధ మార్గాల్లో మార్పిడి చేసుకున్నారు. ఈ నోట్ల రద్దు ప్రభావం సామాన్య ప్రజలపై ఏ మాత్రం పడలేదు.

వరదలు, పిడుగులతో నష్టం

ఏటా వర్షాకాలంలో వరదలతో ఎదురైన తిప్పలే ఈ ఏడాదీ జిల్లా వాసులకు ఎదుర్కొన్నారు. గత జూలై, ఆగస్టు మధ్య కురిసిన అధిక వర్షాలకు గోదావరి బ్యాక్ వాటర్‌తో మంచిర్యాల పట్టణంలో పలు కాలనీలతోపాటు జిల్లాలో చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని ప్రాణహిత, గోదావరి తీర పంటలు నీటమునిగాయి. పిడుగుపాటుతో మరణాలు జరిగాయి. ఈసారి గతేడాది కంటే వరదల తీవ్రత తక్కువగా ఉండడంతో స్వల్ప ఊరట కలిగింది.



వరదలతో మంచిర్యాలలో నీట మునిగిన ఇళ్లు

నిరుద్యోగులకు కష్టకాలం



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు

ఈ ఏడాది నిరుద్యోగులకు కష్టంగానే గడిచింది. జిల్లా నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత పోలీసు, గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యారు. పోలీసు నియామకాలు కోర్టు కేసులతో జాప్యం జరిగాయి. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు రద్దయ్యాయి. గ్రూప్–1 పరీక్ష రెండు సార్లు రాశారు. సింగరేణి కాలరీస్ నిర్వహించిన క్లర్క్ పరీక్షల్లోనూ అవకతవల ఆరోపణలతో మెరిట్ జాబితా వచ్చాక కోర్టు వివాదాలతో గడిచింది. ప్రశ్నపత్రాల లీకేజీలు, ఇబ్బంది పెట్టాయి.

రైళ్ల రద్దుతో అవస్థలు..

గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది జిల్లా గుండా వెళ్లే రైళ్ల రద్దు ప్రయాణికులను ఇబ్బంది పెట్టాయి. తరచూ మూడో రైల్వే ట్రాక్‌లైన్ పనుల పేరిట నెలల తరబడి పలు రైళ్లను నిలిపివేశారు. బల్లార్షా–కాజీపేట మధ్య పలు రైళ్లు రద్దు కావడంతో పండుగలు, ప్రత్యేక దినాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటికీ పలు రైళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తుండడంతో రవాణా అవస్థలు తప్పడం లేదు.



మంచిర్యాల రైల్వేస్టేషన్

అభివృద్ధికి బాట



నాటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పోడు పట్టాల పంపిణీ

ఏళ్లుగా ఎదురు చూస్తున్న గిరిజన రైతులకు ఈ ఏడాదే పోడు పట్టాదారులకు పట్టాలు అందాయి. 1847మందికి 3,821ఎకరాల భూమిపై హక్కులు కల్పించారు. ఈ ఏడాది నుంచే జిల్లాలో మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభమయ్యాయి. 'మన ఊరు–మన బడి' కార్యక్రమంతో జిల్లాలో 248పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పెంపునకు ప్రణాళికలు వేశారు.

కలెక్టర్, ఉన్నతాధికారుల బదిలీలు



భారతి హోళ్లికేరి

నాలుగేళ్లపాటు జిల్లాలో కలెక్టర్‌గా పని చేసిన భారతి హోళ్లికేరి ఈ ఏడాది జనవరిలో బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రస్తుత కలెక్టర్ బదావత్ సంతోష్ బదిలీపై వచ్చారు. అదే నెలలోనే సీపీగా రెమారాజేశ్వరి, డీసీపీగా సుధీర్ రామ్‌నాథ్ కేకన్ వచ్చారు. జిల్లాలో 317జీవో కింద ఉన్నతాధికారులు, ఇతర అధికారుల బదిలీలు జరిగాయి. ఎన్నికలకు ముందు బదిలీలు జరిగి, ఇతర ప్రాంతాల నుంచి అధికారులు వచ్చారు.

కొత్త కలెక్టరేట్ ప్రారంభం



సమీకృత కలెక్టరేట్ భవనం

జిల్లా ఆవిర్భావం తర్వాత అధికారులు, ప్రజలకు సరైన కార్యాలయం లేక ఇబ్బందులు పడ్డారు. నిర్మాణంలో జాప్యంతో కొత్త కలెక్టరేట్ లేక ఎన్నో అవస్థలు ఎదురయ్యాయి. జిల్లా ప్రజలకు ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ఏడేళ్ల ఇబ్బంది పడాల్సి వచ్చింది. నస్పూర్‌లో నిర్మించిన నూతన సమీకృత జిల్లా కార్యాలయాల భవనాన్ని గత జూన్ 9న అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. దీంతో ఇక్కడి నుంచే ప్రస్తుతం అన్ని కార్యాలయాల పాలన సాగుతోంది.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



దశాబ్ది వేడుకల్లో నృత్య ప్రదర్శన

ఈ ఏడాది జూన్ 2నుంచి వరుసగా 22వరకు మొత్తంగా 20రోజులపాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

తొలిసారిగా ఎమ్మెల్యేలుగా..

ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో రాజకీయ మార్పులు తెచ్చాయి. మంచిర్యాల నుంచి పీఎస్సార్, చెన్నూరు నుంచి వివేక్, ఖానాపూర్ నుంచి వెడ్మబొజ్జు తొలిసారిగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అలాగే బెల్లంపల్లి నుంచి వినోద్ ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వంను గద్దె దింపి, కాంగ్రెస్ పాలనను ప్రజలు ఎంచుకున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల ఆది లాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి ఒక ప్ర కటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఫి బ్రవరి 11న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆ న్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వి వరాలకు http://tswreis.ac.in, http:// tgtwgurukulam.telangana.gov.in, http:// mjptbcwreis.telangana.gov.in, http://tgcet.cgg.gov.in వెబ్‌సైట్లలో సందర్శించాలని తెలిపారు.

సీఓఈల్లో ఇంటర్ ప్రవేశాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2024–25 విద్యాసంవత్సరానికిగాను ప్రతిభ కళాశాల(సీఓఈ)ల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల ఆదిలాబాద్ రీ జినల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి తెలిపారు. రాష్ట్రంలోని 38టీఎస్‌డబ్ల్యూఆర్ సీఓఈల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూ పుల్లో ప్రవేశాలకు విద్యార్థిని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కళా శాలల్లో ఐఐటీ–జేఈఈ, నీట్, సీఎంఏ, క్లాట్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. రూ.200 ఫీజుతో జనవరి 15లోగా www.tswreis.ac.in, https:// tsswreisjc.cg g.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 1800 425 45678, osd.tw reispoerations@gmail. com లో సంప్రదించాలని తెలిపారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో జనవరి 1 నుంచి 5వరకు పత్తి కొనుగోళ్లు నిలిపి వేయనున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.భాస్కర్ తెలిపారు. మార్కెట్ కమిటీ పరిధిలోని తాండూర్ మండలం రేపల్లేవాడ శివారులోని రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపట్టామని, మిల్లుల్లో పత్తి నిల్వ చేయడానికి స్థలం ఖాళీగా లేక ఐదు రోజులపాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని తెలిపారు. తిరిగి 6వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగిస్తామని పేర్కొన్నారు..

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: ఈ నెల 31, జనవరి 1వ తేదీల్లో మండల కేంద్రంలోని సీసీఐ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు సీసీఐ సీపీవో ఉదయ్‌షా ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించాలని కోరారు. తిరిగి మంగళవారం కొనుగోళ్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

అప్పీలు లేని అంతిమ తీర్పు



లక్సెట్టిపేట: కేసును పరిష్కరిస్తున్న జడ్జి అసదుల్లా షరీఫ్

- రాజీమార్గమే రాజమార్గం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు అప్పీలు లేని అంతిమ తీర్పు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, ఎలాంటి సమస్య ఉన్నా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న తగాదాలకు కోర్టు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని తెలిపారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల్లో ఇరువర్గాల కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చినట్లు తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, లక్సెటిపేట, చెన్నూర్, బెల్లంపల్లి కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 13వేల కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రూ.51,62,026 జరిమానా వసూలైనట్లు తెలిపారు. బ్యాంకుకు సంబంధించి 18 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి అర్పిత మారంరెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్: స్థానిక కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 315 కేసులు పరిష్కరించి రూ.14,37,952 జరిమానా వసూలు చేశారు. చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి పి.రవి, సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లకెట్టిపేటలో..

లక్సెట్టిపేట: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ కక్షిదారులు కేసుల్లో రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారని రాజీమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. 4,096 కేసులు పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, న్యాయవాదులు అక్కల శ్రీధర్, భూమరెడ్డి, సత్యనారాయణ, ఏజీపీ పద్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 4,386 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి జె.ముఖేష్, పీపీ అజయ్‌కుమార్, న్యాయవాదులు అంకెం శివకుమార్, రాజేశ్ సింగతి, చేను రవికుమార్, ఎం.శ్రీనివాస్, సజ్జనపు సంతోష్, సందీప్, బాలకృష్ణ, సౌమ్య, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- అభయహస్తం దరఖాస్తులు విధిగా అందజేయండి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపాలన ఇంచార్జి ప్రశాంతి



మంచిర్యాలలో దరఖాస్తుల స్వీకరణ పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ప్రశాంతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలటౌన్: ప్రజాపాలనతో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రశాంతి అన్నారు. శనివారం హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లో, మంచిర్యాల మున్సిపాల్టీ గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన కార్యక్రమాలను పర్యవేక్షించారు. అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలతోపాటు వృద్ధులు, మహిళలకు చేయూత ఇచ్చేలా అభయహస్తం దరఖాస్తులు తీసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆరు హామీలకు సంబంధించి ఉన్న ఒకే ఒక్క దరఖాస్తు ఫారాలు అందరికీ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల నియోజకవర్గ ప్రజాపాలన ఇంచార్జి, జెడ్పీ సీఈఓ నరేందర్, చెన్నూర్ ప్రజాపాలన ఇంచార్జి, డీఆర్‌డీఓ శేషాద్రి, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, హాజీపూర్ మండల ఇంచార్జి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌హై తదితరులు పాల్గొన్నారు. కాగా మూడో రోజు వేంపల్లిలో 580, ముల్కల్లలో 641, పెద్దంపేటలో 401, బుద్ధిపల్లిలో 213 దరఖాస్తులు అందాయి. మంచిర్యాలలో ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినప్పుడు ఏయే సమస్యలు వస్తున్నాయనే అంశంపై మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో శనివారం 4,404 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

బుల్లితెరపై యాక్షన్.. కట్..

వెబ్ సిరీస్ సండే స్పెషల్

- యూట్యూబ్, వెబ్‌సిరీస్‌లలో రాణిస్తున్న వికాస్‌రెడ్డి
- చెన్నూర్ టాకీస్ బ్యానర్‌పై పాటలు
- ఉత్తమ డైరెక్టర్, నిర్మాతలుగా అవార్డులు
- త్వరలో ఓటీటీలో ఉత్కంఠ వెబ్ సిరీస్

చెన్నూర్: వెండితెరపై చిత్రం వారి కల. ఆ కల సాకారం కోసం బుల్లితెరపై రాణించడానికి విశేషంగా కృషి చేస్తున్నారు. సినిమా కళారంగంలో వారికంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. చెన్నూర్‌కు చెందిన వికాస్‌రెడ్డి యూ ట్యూబ్, వెబ్ సిరీస్‌లో చిత్రాలు, పాటలతో రాణిస్తున్నాడు. మల్లెల వికాస్‌రెడ్డి గతంలో 'పోరు తెలంగాణ'లో సినిమాలో నటించాడు. ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ, దర్శకుడు అనిల్ ఆ రుద్య వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. సినిమా అవకాశాల కోసం వేచి చూస్తూ సమయం వృథా చేసుకోకుండా యూట్యూబ్‌లో చిన్న సినిమాలు, పాటలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే 'రాతి గుండె నీది ఈశ్వరా' పాటను చిత్రీ కరించాడు. ప్రముఖ సినీనటి సుధతో కలిసి స్వీయ దర్శకత్వంలో నటించా డు. ఈ పాట విశేష ఆదరణ పొందింది. ఈ పాటకు ఉత్తమ డైరెక్టర్‌గా అవార్డు అందుకున్నాడు. మరిన్ని ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాడు.



ఉత్కంఠ చాప్టర్-1 వెబ్ సిరీస్‌లో దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న వికాస్‌రెడ్డి

చెన్నూర్ టాకీస్ బ్యానర్

చెన్నూర్ పట్టణానికి చెందిన చెన్నూరి శ్రీవాణి సొంతంగా చెన్నూర్ టాకీస్ బ్యానర్‌ను ప్రారంభించారు. 'తారలే తారంగమాడే వేళ', బతుకమ్మ పండుగ సందర్భంగా వికాస్‌రెడ్డి దర్శకత్వంలో బతుకమ్మ పాటను చిత్రీకరించారు. ఈ పాటలకు వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. 'తారలే తారంగమాడే వేళ' పాటకు ఉత్తమ డైరెక్టర్, నిర్మాతలుగా ఎక్సలెన్స్ అవార్డులు లభించాయి. పాటకు వచ్చిన స్పందన చూసి ప్రముఖ సినీ డైరెక్టర్ రామ్ గోపాల్‌వర్మ వికాస్‌రెడ్డిని అభినందించారు.

చెన్నూర్ టాకీస్ బ్యానర్‌పై సినీ నటుడు ఆనంద్‌భారతి, స్పందనలతో 'ఉత్కంఠ' అనే వెబ్ సిరీస్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు మొదటి పార్ట్ పోస్టర్ విడుదల చేశారు. ఉత్కంఠ చాప్టర్–1 వెబ్ సిరీస్‌ను త్వరలో ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చెన్నూర్‌కు గుర్తింపు వచ్చింది..



చెన్నూర్ ప్రాచీన చరిత్రకు చిహ్నంగా నిలిచింది. కవులు, కళాకారులకు అడ్డాగా ఉంది. చెన్నూర్ పేరు సినీ రంగంలో వినిపించాలని చెన్నూర్ టాకీస్ బ్యానర్‌ను ఏర్పాటు చేశా. తొలి ప్రయత్నంగా 'తారలే తారంగమాడే వేళ' పాటను డైరెక్ట్ చేశాం. పాటకు మంచి స్పందన వచ్చింది. ఇదే బ్యానర్‌పై మరో వెబ్ సిరీస్‌ను తీస్తున్నాం. రానున్న రోజుల్లో చెన్నూర్ వారికి అవకాశం ఇస్తాం.

– చెనూరి శ్రీవాణి, డైరెక్టర్, నిర్మాత, చెన్నూర్

రానున్న రోజుల్లో సినిమా చేస్తా..



ఇప్పటివరకు డైరెక్ట్ చేసిన 'రాతిగుండె నీది ఈశ్వరా', 'తారలే తారంగమాడే వేళ' పాటలు మంచి పేరు తెచ్చి పెట్టాయి. చెన్నూరి శ్రీనివాస్, శ్రీవాణిల అధ్వర్యంలో చెన్నూర్ టాకీస్ బ్యానర్ ప్రారంభించాం. త్వరలో ఉత్కంఠ చాప్టర్–1 వెబ్ సిరీస్‌ను ఓటీటీలో విడుదల చేస్తాం. గతంలో కొన్ని సినిమాల్లో సహాయ నటుడిగా నటించాను. రానున్న రోజుల్లో చెన్నూర్ టాకీస్ బ్యానర్‌పై పెద్ద తెర సినిమా చేస్తాం.

– వికాస్‌రెడ్డి మల్లెల, డైరెక్టర్, చెన్నూర్

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కాసిపేట: నిరుద్యోగ యువతకు ఎస్‌ఏసీ(న్యాక్), ఈజీఎంఎం–డీడీయూజీకేవై ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఆదిలాబాద్ న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రికల్ అండ్ హౌస్ వైరింగ్, పదో తరగతి ఫెయిల్ లేక పాసైన వారికి ప్లంబింగ్ అండ్ సానిటేషన్ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 18ఏళ్ల నుంచి 35ఏళ్ల లోపు యువత అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి, బుక్స్, యూనిఫాం, షూస్, హెల్మెట్ అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, అర్హత సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లు, ఐదు పాస్‌ఫొటోలతో ఐటీడీఏ, వైటీసీ బిల్డింగ్, తాళ్లగురిజాలరోడ్, సోషల్ వెల్ఫేర్ స్కూల్ బెల్లంపల్లి సమీపంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8328507232, 9966110045 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీల్లో ప్రతిభ



పతకం అందుకుంటున్న పి.కృష్ణ

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో కాగజ్‌నగర్‌కు చెందిన పి.కృష్ణ ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు కృష్ణను అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'బొగ్గుచోరీ పేరిట.. జేసీబీ, లారీలు స్వాధీనం' అనే వార్తకు సింగరేణి అధికారులు స్పందించారు. శుక్రవారం సాయంత్రం రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మందమర్రి ఏరియా జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ (ఎస్‌అండ్‌పీసీ) జేసీబీ, రెండు లారీల చోదకులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ధాన్యం కుప్ప దగ్ధం

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన రైతు ఎస్. సంతరాంకు చెందిన ధాన్యం కుప్ప విద్యుత్ ప్రమాదంలో శనివారం దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎకరం పొలంలోని ధాన్యం కుప్పగా పోశాడు. ఈ క్రమంలో వరి గడ్డి సమీపంలోని విద్యుత్ తీగలపై పడడంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ధాన్యంతో పాటు గడ్డి పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సంతరాం చేతికి స్వల్ప గాయాలయ్యాయి. కేశార్ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రూ.50వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని సదరు రైతు వేడుకుంటున్నాడు.

వ్యాసరచన పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు, సీఆర్వో ఇండియా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి చేతన సోనీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల 'వికాసం'

ఉట్నూర్‌రూరల్: సమాజంలోని ప్రతీఒక్కరిలో ఏదో ఒక సమాజ సేవ చేయాలనే ఆతృత ఇమిడి ఉంటుంది. సమాజ సేవ చేయడానికి ఒక్కొక్కరూ ఒక్కో విధంగా రాణిస్తుంటారు.. అదే మార్గంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సైతం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన దివ్యాంగ విద్యార్థులకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ఓ పాఠశాలను ఏర్పాటు చేశాడు. భోజనం, వసతి, విద్యను అందిస్తున్నారు. ఆ విద్యా సంస్థ పేరే.. వికాసం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఈ పాఠశాలలో పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.

- ప్రత్యేక నదుపాయాలతో వసతి
- చదువుల్లో రాణించేలా బోధన
- క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణింపు
- అంధ విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు



ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం పాఠశాల

పీవో కర్ణన్ ప్రత్యేక చొరవ...

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో అప్పటి ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ ప్రత్యేక చొరవతో దివ్యాంగుల కోసం వికాసం పాఠశాలను ఏర్పాటు చేయించాడు. నాలుగు రకాల వైకల్యాలు కలిగిన మొత్తం 142మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను 2015 నవంబర్‌లో హైకోర్టు జడ్జి దిలీప్ జీ బోస్లే చేతుల మీదుగా ప్రారంభించారు.

వైకల్యం గల వారికి..

వికాసం ప్రత్యేక బాలల పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు చదువుకుంటున్నారు. ఇందులో బుద్ధి మాంద్యం గల విద్యార్థులు 37మంది. బద్దిరులు (చెవిటి, మూగ) 61, అంధులు 29, అంగవైకల్యం కలిగిన వారు 15 మంది ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు.

పాఠశాల ప్రత్యేకత...

ఈ వికాసం పాఠశాలలో దివ్యాంగుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్వీ కర్ణన్ ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేయించారు. ఈ పాఠశాలలో ప్రత్యేకంగా దివ్యాంగులైన పిల్లల కోసం హాస్టల్ వసతి, ప్రత్యేకమైన ఉపాధ్యాయులతో బోధన, మంచి భోజనం, మినరల్ వాటర్, స్నాక్స్ అందిస్తున్నారు. పిల్లలకు ప్రతి నెల డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. పాఠశాలలో పిల్లల కోసం ఆట స్థలం, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. ఈ పాఠశాలలో మొదట 1వ తరగతి నుంచి 5 వరకు నిర్వహించారు. ప్రతీ ఏడాది ఓ తరగతిని పెంచుతూ ప్రస్తుతం 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో అంధుల కోసం ప్రత్యేక డార్మెంటరీని ఏర్పాటు చేశారు. దీంతో అంధ విద్యార్థులు వారి పనులు వారే చేసుకుంటారు. అంధులు స్మార్ట్ కేన్ సాయంతో టాయిలెట్స్‌కి, తరగతి గదుల్లోకి వెళ్తుంటారు. వీరికి ప్రత్యేకంగా ర్యాంపులు సైతం ఏర్పాటు చేశారు.



దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడల్లోనూ ప్రతిభ...

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మైదానంలో జరిగిన ఆటల పోటీల్లో రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారెం, జావిలింగ్‌త్రో పోటీల్లో అంధులు, మానసిక వికలాంగ విద్యార్థులు పాల్గొని 18 బహుమతులు గెలుపొందారు. 27న 6వ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఆరుగురు విద్యార్థులు సత్తాచాటి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. అలాగే సైన్స్‌ఫేర్ పోటీల్లో సైతం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు.



క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న పీవో

ఇక్కడ చదువుకోవడం ఇష్టం..



వికాసం పాఠశాలలో ఉండి చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్న. ఇక్కడ చదువుకోవాలంటే చాలా ఇష్టం.. సార్లు బాగ చూసుకోవడంతో పాటు తమకు అర్థమయ్యే రీతిలో మమ్మల్ని చదివిపిస్తున్నారు. అంతేకాకుండా తమ పనులు తాము చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎవరి తోడు లేకున్నా మా పనులు మేము చేసుకుంటాం.

– టి.హన్మంతు, 7వ తరగతి, అంధ విద్యార్థి సిర్పూర్(యు)

ఇంటికి కూడా వెళ్లం..



ఇంటి కంటే ఇక్కడే మంచిగా అనిపిస్తది. అందరితో కలిసి చదువుకోవడం అన్ని పనులు చేసుకోవడం బాగుంటుంది. సార్లు తమకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించడం, మంచి భోజనం అందించడం, ఆటలు, పాటలు నేర్పించడం సంతోషాన్ని కలిగిస్తుంది. నేను కూడా బాగా చదువుకొని మంచి స్థాయికి ఎదుగుతా..

– బి.రంజిత్, 8వ తరగతి, ఉట్నూర్ కొత్తగూడ

పిల్లలు ఇష్టంగా నేర్చుకుంటున్నారు..



పాఠశాలలో ఉన్న విద్యార్థులంతా అంగ వైక్యలం కలిగిన వారే. వారికి చదువంటే చాలా ఇష్టం.. తాము సైగల ద్వారా వారికి విద్యాబోధన చేస్తాం.. మొదట్లో కాస్త కష్టమైన వారికి అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తుండడంతో వారు ఇష్టంగా చదువుకుంటున్నారు. ఆటపాటలు నేర్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వీరికి విద్యను అందించడం అదృష్టంగా భావిస్తున్న.

– పావని, ఉపాధ్యాయురాలు

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



దివ్యాంగ విద్యార్థులు కావడంతో వారికి అన్నివసతులు, భోజన సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పాఠశాల గురించి తెలుసుకున్న వారు ఇతర జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులను ఇక్కడ చేర్పిస్తున్నారు. చదువుతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది.

– రాథోడ్ వికాస్, వికాసం పాఠశాల, ప్రధానోపాధ్యాయుడు

వివాదమైన షెడ్డు నిర్మాణం



పనులను అడ్డుకుంటున్న ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజ్ పరిధిలోని నస్పూర్ కాలనీలోని కంపెనీ క్వార్టర్ ఎదుట కార్మికుడు నిర్మించుకుంటున్న షెడ్డు వివాదస్పదమైంది. ఓ కార్మికుడు క్వార్టర్‌లో స్థలం సరిపోకపోవడంతో అందరి వలే ఇంటి ముందు షెడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో శనివారం సెక్యూరిటీ సిబ్బంది వచ్చి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సదరు కార్మికుని కుటుంబానికి సెక్యూరిటీ సిబ్బందికి మధ్యవాగ్వాదం చోటుచేసుకుంది. అనుమతి లేకుండా ఎలా కడుతారంటూ కార్మికుని కుటుంబాన్ని సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించి అప్పటి వరకు కట్టిన గోడను కూల్చివేశారు. అనుమతి కోసం తాము అధికారులను కలిశామని కుటుంబం పేర్కొనగా అనుమతి వచ్చేంత వరకు కట్టేది లేదని కొంత నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇంటి వారు ఎంత వారించిన కూడా వారు వినిపించుకోకుండా గోడులను కూల్చివేశారు. దీనిపై కార్మికుడి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలోని వందలకొద్ది షెడ్లు కట్టుకున్నారని వీటన్నింటికి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. దీన్ని హెచ్ఎమ్మెస్ నాయకులు సోషల్ మీడియాలో పెట్టడంతో చర్చనీయాంశంగా మారింది. సెక్యూరిటీ అధికారుల తీరును హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. కంపెనీ అధికారులు ఇలాంటి చేష్టలు మానుకోవాలన్నారు.

ఆదివాసీ రైతు అదృశ్యం



రాంచందర్

కెరమెరి: మండలంలోని మెట్టపిప్రి గ్రామానికి చెందిన మడావి రాంచందర్(35) అదృశ్యమయ్యాడు. ఐదు రోజుల నుంచి కనిపించకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబీకుల వివరాల ప్రకారం... సోమవారం రాత్రి పొలంలో ఉన్న కంది పంటను పందులు, కోతుల బారినుంచి రక్షణ కోసం అడవికి వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు అడవులు, నదులు అన్ని కలియ తిరిగినప్పటికీ ఆచూకీ లభించలేదని తండ్రి గోవింద్‌రావు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన సెక్టోరల్ అధికారులు

కోటపల్లి: మండల కేంద్రంతో పాటు సర్వాయిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తిలు సందర్శించారు. ఇందులో భాగంగా తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలుతీరును, తరగతి గది బోధన తీరును పరిశీలించారు. సీఆర్పీలు, ఐఈఆర్పీలు చేస్తున్నటువంటి బడి బయటి పిల్లల సర్వేను పరిశీలించారు. జెడ్పీఎస్ఎస్ కోటపల్లి పాఠశాలలో వంద శాతం హాజరు కలిగిన విద్యార్థులను సన్మానించి బహుమతులు అందజేశారు. వారి వెంట కృష్ణమూర్తి, హెచ్ఎం నాగేందర్, సీఆర్పీ సంపత్, ఐఈఆర్పి కృష్ణవేణి, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.... ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్ ఈ నెల 26వ తేదీన రాత్రి అదే గ్రామంలోని కిరాణ షాపుకు కోడిగుడ్లు కొనేందుకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీరబోయిన సతీశ్, పంది మహేశ్, అలుగునూరి అరుణ్ అనే వ్యక్తులు షాపు వద్దే ఉన్నారు. వాళ్లు సంపత్‌తో మాట్లాడుతుండగా సతీష్ సంపత్‌ను అవురా అని అన్నాడు. కులం తక్కువ వాడివి అలా అంటావా అని సతీష్, మహేష్, అరుణ్ సంపత్‌ను కడుపుపై గుద్దారు. దీంతో ఇంటికి వెళ్లిన సంపత్‌కు నొప్పి ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మళ్లీ సంపత్‌కు శుక్రవారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో చెన్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జైపూర్ ఏసీపీ మోహన్ పరిశీలించారు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నతుట్లు సీఐ వివరించారు.



సంపత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న జైపూర్ ఏసీపీ

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో నిర్వహించిన అండర్–17 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థులు రాకేష్, సన్ని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. జనవరి 2 నుంచి 5 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీ యాదగిరి, పీఈటీ నరేందర్, సంపత్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గంజాయి పట్టివేత

వాంకిడి: కెరమెరి మండలంలోని బారె మోడి గ్రామానికి చెందిన మొహర్లే బడిరాం ఇంటి ఆవరణలో ఈ నెల 29న తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువైన 1.320 కిలోల పచ్చి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ని ర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కెరమెరి ఎస్సై విజేయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈజ్‌గాం రోడ్డు (ఆర్‌ఆర్‌ఓ కాలనీ) వద్ద గల పెట్రోల్‌పంపు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... పట్టణ సీఐ బుద్దే స్వామి, ఎస్సై ఎంబడి శ్రీకాంత్‌లు పెట్రోలింగ్‌లో భాగంగా ఆర్‌ఆర్‌ఓ కాలనీ వైపు వస్తుండగా ద్విచక్ర వాహనంపై కూర్చొని ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా ఓ ప్యాకెట్‌లో 40 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన యువకుడు కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాళీ క్యాంపు–3కు చెందిన మిథున్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

గోదావరి రైస్ స్టోర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: గోదావరి ఎఫ్‌పీవో రైస్‌స్టోర్స్‌లో నాణ్యమైన జైశ్రీరామ వడ్లను రైతుల నుంచి సేకరించి ఎక్కువ పాలిష్ లేకుండా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి కల్తీ లేకుండా తక్కువ ధరకు బియ్యం అందించడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన గోదావరి ఎఫ్‌పివో రైస్‌స్టోర్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జెడ్పీసీవో నరేందర్ ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాలతో భీమారం, జైపూర్ మండలాల్లో గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన రైతుల నుంచి నాణ్యమైన జైశ్రీరామ వడ్లను సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ ధాన్యం ఎక్కువ పాలిష్, కల్తీ లేకుండా గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యుల పర్యవేక్షణలో మిల్లింగ్ చేయడం జరిగిందని, క్వింటాల్‌కు రూ. 5,800 ధరతో ఎలాంటి లాభాపేక్ష లేకుండా విక్రయ కేంద్రం విక్రయించేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. విక్రయ కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడానికి అదనపు రవాణా చార్జీలతో సౌకర్యం కల్పించడం జరిగిందని, బియ్యం కావాల్సిన వారు 9652004886, 7337488828, 9121103856 నంబర్లలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి. రాహుల్

అన్ని రంగాల్లో ఆర్కే 6 గని ముందంజ

- ఉత్పత్తిలో 110 శాతం
- గని మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: అన్ని రంగాల్లో ఆర్కే–6 గని ముందంజలో ఉందని ఆ గని మేనేజర్ తిరుపతి తెలిపారు. శనివారం గనిపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో 2023లో సాధించిన విజయాలను వివరించారు. ఇప్పటి వరకు గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 1,46,493 టన్నులకు 1,80,000 సాధించి 110 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిందన్నారు. భూగర్భ గనుల్లో అధిక ఉత్పత్తిని సాధించిన గనుల్లో ఆర్కే 6 గని ప్రత్యేక స్థానం సాధించిందన్నారు. 2022 రక్షణ వారోత్సవాల్లో భాగంగా రక్షణ చర్యల్లో గనికి కంపెనీ వ్యాప్తంగా ప్రథమ స్థానం లభించిందన్నారు. అంతే కాకుండా ఎస్‌డీఎల్ పరంగా ఉత్పత్తిలో కూడా కంపెనీలో గని ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు తీసుకుందన్నారు. సెంట్రల్ కోల్ మినిస్ట్రీ వారు గనుల్లో ఉత్పత్తి, రక్షణ, కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు అన్నింటిని పరిశీలించి తమ గనికి ఫోర్ స్టార్ రేటింగ్ ఇచ్చారని, ఇది తమకెంతో గర్వకారణం అన్నారు. దీనితో పాటు ఇటీవల జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో తమ గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్ ఉత్తమ అధికారిగా, ఉత్తమ ఉద్యోగిగా రాంరెడ్డి ఎంపికై బహుమతులు పొందారన్నారు. ఈ రికార్డులన్ని ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమిష్టి కృషి చేయడంతోనే సాధ్యమైందన్నారు. గనిలో బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి, ఏజెంట్, ఇతర అధికారుల సహాయ సహకారాలతో ఈ విజయాలను నమోదు చేసుకున్నామన్నారు. గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, డెప్యూటీ మేనేజర్ యస్ కొమురయ్య, ఇంజనీర్ శ్యాంకుమార్, సెక్షన్ ఇంజనీర్ మహేశ్, సర్వే అధికారి వర్మ ఉన్నారు.



మాట్లాడుతున్న ఈ తిరుపతి

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



రోహిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 18న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహించగా సీఓఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వేల్పుల రోహిత్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరఫున ఆడి ప్రతిభ కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు కాంస్య పతకం సాధించడానికి రోహిత్ తోడ్పడ్డాడు. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు రోహిత్‌ను ఎంపిక చేశారు. జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బాలాస్‌పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున రోహిత్ ఆడనున్నట్లు సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్‌ను శనివారం ప్రిన్సిపాల్, పీఈటీలు అభినందించారు. ఇందులో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా సెక్రెటరీ పరిమళ, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేపీపీ కె.రాజేశ్వర్, పీడీ అల్లూరి వామన్, పీఈటీ నడిగొట్టి రాకేష్, ఉపాధ్యాయులు దత్తప్రసాద్ ఉన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు..

దండేపల్లి: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దండేపల్లిలో శనివారం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వారం రోజుల నుంచే హామీల అమలులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మరో ఐదు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. జెడ్పీసీవో నరేందర్, డీపీవో వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి స్వామిరెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



దండేపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

అధికారుల అత్యుత్సాహం..

దరఖాస్తుల స్వీకరణలో అధికారులు అత్యుత్సాహంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే వచ్చే వరకు దరఖాస్తులు తీసుకోవద్దని మండలస్థాయి అధికారుల చెప్పారు. దరఖాస్తులు ఇచ్చేందుకు మధ్యాహ్నం వచ్చిన ప్రజలు సాయంత్రం 6గంటల వరకు వేచి ఉన్నారు.

డైరెక్టర్‌కు ఐఎన్‌టీయూసీ వినతి

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా పెండింగ్‌లోని పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ యాజమాన్యం కోరారు. ఈ మేరకు శనివారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి హెడ్ ఆఫీస్‌లో కంపెనీ డైరెక్టర్ (ఫైనాన్స్, పా) యన్ బలరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం డైరెక్టర్ (ఆపరేషన్) యన్‌వీకే శ్రీనివాస్‌ను కూడా కలిసి ఆయన దృష్టికి కూడా పలు సమస్యలను తీసుకెళ్లారు. రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాలతో పాటు శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. రాపిడ్ గ్రావిటీ సిస్టం ద్వారా తాగునీరు అందించాలని కోరారు. దీని కోసం గతంలో తాము చేసిన పోరాటం ఫలితంగా కంపెనీ రూ.20కోట్లు మంజూరు చేసిందని, కానీ ఇప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడం వలన కార్మికులు అపరిశుభ్ర నీరే తాగాల్సి వస్తుందన్నారు. వెంటనే టెండర్లు పిలిచి తాగునీటిని అందించాలని కోరారు. మెడికల్ బోర్డులో జరిగే అవినీతిని పూర్తి అరికట్టాలని, పారదర్శకంగా మెడికల్ బోర్డును నిర్వహించాలని కోరారు. ఆ యూనియన్ సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్